ప్రజాశక్తి
శనివారం 5 ఏప్రిల్ 2025 5 అనంతపురం





వక్ఫ్ సవరణ చట్టం వద్దంటూ అనంతలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

రాజ్యాంగ విలువలకు బిజెపి తిలోదకాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లౌకికవాదం, సమానత్వం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చి వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డిలు విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ప్రధాన మసీదుల వద్ద శుక్రవారం నాడు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 మేనిఫెస్టోలో బిజెపి వక్ఫ్ ఆస్తులను కాపాడుతామని, వక్ఫ్ బోర్డులకు అధికారం కలిపిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీలను పూర్తిగా విస్మరించి మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తుందని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. బిజెపి తన ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవడం కోసం సమాజంలో మత ఉద్రిక్తతలు రేకెత్తించడానికి ఈ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. మతవిద్వేషాలకు కారణం అవుతూ ముస్లిములకు నష్టం చేసేలా ఉన్న వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకట నారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, బుల్లె రాజు, వెంకటేశు, బాలకష్ణ, ఓబులేసు, సిపిఎం రజక వత్తిదారుల సంఘం నాయకులు రామాంజి, శాఖ కార్యదర్శులు ఫక్రు, ఇస్మాయిల్, రామంజి, తులసి, సునీత, పీరా, చాంద్‌బాషా, దాదు, లక్ష్మన్న, హాజీ వలీ, షరీఫ్, బాషా పాల్గొన్నారు.

జుడియో ఎ క్యాకియా..!



◆ నిర్మాణ పనులు సాగుతుండగానే ప్రారంభం

◆ చిన్నపాటి వర్షానికి కూలిన సైడ్‌వాల్ ◆ ప్రమాదం జరిగితే అంతేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మల్టీప్లెక్స్ మాల్ నిర్మాణం పూర్తవకనే 'జూడియో' సంస్థ ప్రారంభోత్సవం చేపట్టింది. అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట పంచాయతీ పరిధిలో ఐదు అంతస్తుల్లో రెండు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. పై అంతస్తుల్లో ఇంకా పనులు సాగుతున్నాయి. ఓ వైపు నిర్మాణ పనులు జరుగుతుండగానే మరోవైపు గత నెలలో ఈ మాల్ ప్రారంభోత్సవం జరిగింది. కార్పొరేట్ సంస్థ దుకాణం తెరవడంతో పెద్దఎత్తున జనం కూడా బట్టల కొనుగోళ్లకు వెళ్తున్నారు. జనం ఎక్కువ వెళ్తున్న నేపథ్యంలో ఇంకా నిర్మాణ పనుల్లో ఉన్న భవనంలో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. గురువారం రాత్రి కురిసిన ఒక మోస్తరు వర్షానికే జుడియో పై అంతస్తుల్లోని సైడ్‌వాల్ ఊడి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరూ అటువైపు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే అటువైపు వెళ్లే వారిపడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశాలుండేవి.

కళ్లుమూసుకున్న అధికారులు

నిబంధనలను ఏ మాత్రం పాటించకుండా ఒక పెద్ద సంస్థ హంగామాతో ప్రారంభోత్సవం చేపట్టినా అధికారులు మాత్రం కళ్లు మూసుకుని మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద మాల్ నిర్మాణం చేపట్టిన సమయంలో వివిధ దశల్లో అధికారులు పరిశీలనలుంటాయి. భవన నిర్మాణం సమయంలో మొదటగా అగ్నిమాపక శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఆ తరువాత ఆక్యుపెన్సి సర్టిఫికెట్ పొందాలి. నిర్మాణం పూర్తయ్యాక ఏదైనా లోటుపాట్లు ఉంటే అధికారులు పరిశీలించి వాటిని సవరించిన తరువాత ప్రారంభోత్సవాలకు అనుమతినివ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఇందులో వ్యాపార సంస్థలు నిర్వహించుకునేందుకు వీలుంటుంది. కాని జూడియో అనంతపురంలో ఏర్పాటు చేస్తున్న భవనానికి సంబంధించి అటువంటి నిబంధనలు ఏవీ పాటించకుండానే ప్రారంభోత్సవం ఘటనంగా జరిగింది. ఇంత జరిగినా అధికారులు మాత్రం తమకేమి సంబంధం లేనట్లుగా మౌనం వహించడం అనేక విమర్శలకు తావిస్తోంది.



గురువారం కురిసిన వర్షానికి కూలిపోయిన జుడియో సైడ్‌వాల్

మా కార్యాలయం నుంచి అనుమతుల్లేవు

అనంతపురంలో జుడియో ప్రారంభించిన నూతన భవన నిర్మాణానికి సంబంధించి మా కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆ రకంగా ఆ భవనానికి ఆన్‌లైన్‌లో మా పై అధికారుల నుంచి ఏదైనా అనుమతి పొంది ఉంటే అది తమ దృష్టిలో లేదు. మా కార్యాలయం నుంచి మాత్రం ఎటువంటి అనుమతిలేదు.

శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందలేదు

జుడియో అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇంకా పొందలేదు. నిర్మాణ పనులు సాగుతున్నాయి. అప్పుడే ప్రారంభించవద్దని కూడా ఆ భవన నిర్మాణం చేపట్టిన వారికి సూచించాం. నిబంధనల మేరకు నిర్మాణం జరగాల్సి ఉంది. నిర్మాణం పూర్తయిన తరువాత పరిశీలించి అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తాం.

ఇషాక్, అహుడా ప్లానర్.

సమ్మెలోకి శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం : ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లింపుల్లో జాప్యాన్ని నిరసిస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లకు అనేక దపాలుగా వినతి పత్రాలు అందజేశామన్నారు. వేతనాలు ఇవ్వకుంటే ఏప్రిల్ 5వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. సమస్యలపై అధికారులు స్పందించకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. బకాయి వేతనాలను అందించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి రాము పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం

ఎన్‌జిసి రీజినల్ కో-ఆర్డినేటర్ కె.ఆనంద్ భాస్కర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమని భావితరాలకు మనమిచ్చే విలువైన బహుమానం కలుషితం కాని వాతావరణమేనని నేషనల్ గ్రీన్ కార్ప్ రీజినల్ కో-ఆర్డినేటర్ కె.ఆనంద్ భాస్కర్ తెలియజేశారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీ సినర్జీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 'పర్యావరణం-సుస్థిర అభివద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవులు, నిర్జీవులు పర్యావరణంలో భాగమన్నారు. ఒక జీవి పుట్టడానికి, జీవించడానికి పర్యావరణం చాలా ముఖ్యమన్నారు. ఇలాంటి పర్యావరణాన్ని కాపాడే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని ప్రధానవక్త, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.వంశీకృష్ణ తెలియజేశారు. సైన్స్ ఎంత అభివద్ధి చెందుతుందో ఆ దేశం కూడా అంతటి ఉన్నత స్థాయిలో ఉంటుందని తెలిపారు. జెవివి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "పర్యావరణం-సుస్థిర అభివద్ధి"పై రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లక్ష్మీ సినర్జీ విద్యార్థులకు రావడం చాలా సంతోషమని జెవివి నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన తెలిపారు. సదస్సు అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా తరిమెల అమర్నాథ్ రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి, జెవివి నాయకులు రామిరెడ్డి, తిరుపాలు, రామకష్ణ, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న జెవివి నాయకులు

పంటపై వర్షం దెబ్బ

పుట్లూరులో నేలకూలిన అరటిచెట్లు - పలు మండలాల్లో పంట నష్టం

ప్రజాశక్తి-పుట్లూరు, శింగనమల
కళ్యాణదుర్గం రూరల్, బొమ్మనహాల్

గురువారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కురిసిన వర్షాలు అనంతపురం జిల్లాలో పలు పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. గత 20 రోజుల క్రితం కురిసిన వర్షానికి పుట్లూరు, యల్లనూరు, తాడిమర్రి తదితర మండలాల్లో అరటిచెట్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. తాజాగా గురువారం నాటి వర్షం అరటిపై మళ్లీ దెబ్బకొట్టింది. పుట్లూరు మండల పరిధిలోని నాయకులపల్లి, మడ్డిపల్లి కడవకల్లు, గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులకు అరటిచెట్లు నేల కురిగాయి. లక్షలు పెట్టుబడి పెట్టి అరటి సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో అవి నేలకూలడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకునిపల్లి గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 5 ఎకరాలలో అరటి పంట సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలకు నేలమట్టం అయ్యిందన్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు.

బీర నేలపాలు

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలంలోని గుద్దెళ్ల గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి రూ.10 లక్షల విలువజేసే బీర పంట నేలపాలైనట్లు బాధిత రైతులు తెలిపారు. లీలావతి, గుద్దెళ్ల హోరిలకు చెందిన 10 ఎకరాల్లో సాగు చేసిన బీర పంట మొత్తం ఈదరుగాలులు, వర్షంతో చేతికందకుండా పోయింది. రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. ఉద్యానవన శాఖాధికారి గౌసియాభి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సునీల్, విఆర్వో పక్కీరప్పలు పంట పొలాలను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు.

తడిసిన మిరప

బొమ్మనహాల్ : మండలంలోని దర్గావన్నూరు, గోవిందవాడ గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి కురిసిన గాలీవానకు అరబెట్టిన ఎండుమిర్చి తడిసిపోయింది. ఉంతకల్లు గ్రామంలో మామిడి, ఎల్‌బి.నగర్‌లో సపోటా, దానిమ్మ, దేవగిరి, బొమ్మనహాల్‌లో అరటి, రామదాసప్పతోటలో మునగా పంటలు అకాల వర్షంతో దెబ్బతిన్నాయి. మండలంలో వరి 150 ఎకరాలు, దానిమ్మ 300 ఎకరాలు, అరటి 25 ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. వీటితో పాటు ఎండిమిర్చి, మామిడి ఇతర ఉద్యానవన పంటలూ దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న పంటల పరిశీలన

శింగనమల : మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి, తదితర పంటలను తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్‌లు శుక్రవారం పరిశీలించారు. జూలకాలువ, కొరివిపల్లి, కల్లుమడి తదితర గ్రామాల్లో వరి పంట పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 120 ఎకరాల వరి పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నష్టం అంచనాను ఉన్నతాధికారులకు పంపుతామని తహశీల్దార్ తెలియజేశారు.



పుట్లూరు మండలంలో నేలకొరిగిన అరటి పంట



దెబ్బతిన్న బీరపంటను చూపుతున్న రైతులు



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

భూ అక్రమాలపై అధికారుల స్పందన

ముదిగుబ్బ ఎంపిపికి నోటీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండల కోట్లాది రూపాయల విలువజేసే అసైన్డ్ భూముల అక్రమాలపై అధికారులు చర్యలను మొదలు పెట్టారు. కొట్లాది రూపాయలు విలువజేసే ప్రభుత్వ భూమిని బిజెపి నాయకుడు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ స్వాధీనం చేసుకోవడంపై సిపిఎం నాయకులు మార్చి 24వ తేదీన ఆధారాలతో సహా కలెక్టర్, జిల్లా రెవెన్యూ, డివిజన్ అధికారులు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ముదిగుబ్బ మండల ఎంపిపి జి.ఆదినారాయణ యాదవ్ అనంతపురం రూరల్ పరిధిలోని అసైన్డ్ భూమిని అక్రమంగా ఆక్రమించి, భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించిన అధికారులు ఆయనకు నోటీసులు జారీచేశారు. ఆయనతో పాటు బినామీలు శివశంకర్ రెడ్డితో సహా పలువురికి నోటీసులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టం, 1977 ప్రకారం, అసైన్డ్ భూముల విక్రయం, కొనుగోలు చట్టవిరుద్ధమని, అలా చేయడం అనుమతించబడదని అధికారులు నోటీసుల్లో స్పష్టం చేశారు. ఈ నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో దాదాపు పది ఎకరాలు కోట్ల రూపాయలు విలువజేసే ప్రభుత్వ భూమికి సంబంధించి గత కొన్ని రోజులుగా మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. స్పందించిన జిల్లా అధికారులు ఇటీవల అధికారికంగా సర్వే నిర్వహించారు. అనంతరం ప్రాథమికంగా ఈ భూమి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్, అతని బినామీలు 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు పంపారు. 15 రోజుల గడువు ముగిసిన తర్వాత, సదరు భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించి చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని జిల్లా రెవెన్యూ అధికారి తెలియజేశారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు.

'ఇన్ హైబిటేషన్ ఆఫ్ క్యాస్ట్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాసిన 'ఇన్ హైబిటేషన్ ఆఫ్ క్యాస్ట్' పుస్తక అనువాదాన్ని ఆవిష్కరించారు. కోనసీమ జిల్లాకు చెందిన వైద్యుడు కిరణ్ చైతన్య ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మాస్టారు బద్దేనాయక్ చేత ఆ పుస్తక అనువాదాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ కిరణ్ చైతన్య మాట్లాడుతూ ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్ బద్దే నాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో చూసి ఆకర్షితులై ఇక్కడికి వచ్చానన్నారు. ఈ ట్రస్ట్‌కు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ట్రస్ట్ ఛైర్మన్, సభ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఎస్. హనుమంత రాయుడు, ట్రస్ట్ కోశాధికారి అబ్దుల్ వాహబ్, సభ్యులు సాయినాథ్, మహలింగ, తిప్పేస్వామి, చిరంజీవి, ఓబులేష్ పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ దండు విజయభాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థినులు హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, 3 ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభ మయ్యాయని, విద్యార్థినులు తప్పకుండా హాజరుకావాలన్నారు. కళాశాలలో విద్యార్థినులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని ఉడేగోళం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకూ రాయదుర్గం, గుమ్మగట్ట మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు సకాలంలో గ్రౌండింగ్

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బీసీ,ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్లకు సంబంధించిన యూనిట్లను సకాలంలో గ్రౌండింగ్ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్లకు సంబంధించిన యూనిట్ల గ్రౌండింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే 11వ తేదీన నిర్వహించే మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్లకు సంబంధించిన యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాకు మొత్తం 1,728 యూనిట్ల లక్ష్యాన్ని కేటాయించగా, ఇప్పటివరకు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల నుంచి 1,571 యూనిట్లు బ్యాంకులకు పంపనున్నట్లు చెప్పారు. మిగిలిన యూనిట్లను ఎంపీడీవోలు, కమిషనర్లతో ఫాలోఅప్ చేసి బ్యాంకులకు త్వరితగతిన పంపించాలన్నారు. కేటాయించిన గడువులోపు యూనిట్లు గ్రౌండింగ్ చేసేలా చూడాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 7వ తేదీలోపు బ్యాంక్ మేనేజర్లు లబ్ధిదారులకు రెండు అకౌంట్లను ఓపెన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎల్డిఎం బ్యాంకు డిఎల్‌డిఒ మానస శ్వేత, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు

నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్‌ని తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలిపారు. ప్రతివారం షెడ్యూల్ చేసుకుని జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఎ.మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, ఆర్డీవోలు కేశవ నాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలి

జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని జిల్లా మినరల్ ఫండ్స్ కింద చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. ఈనెల 8వ తేదీన ఎంపీలు, జిల్లా ఎమ్మెల్యేలతో అనంతపురం కలెక్టరేట్లో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలోపు ప్రతిపాదనలన్నీ సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మైన్స్ డిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మంజుల వన్నూరుస్వామి

కమిటీ మెంబర్‌గా పాలబండ్ల ముత్యాలమ్మ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కళ్యాణదుర్గం మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మండలంలోని గొంచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంజుల వన్నూరుస్వామి, కమిటీ మెంబర్‌గా పాలవెంకటాపురం గ్రామానికి చెందిన పాలబండ్ల ముత్యాలమ్మను నియమించినట్లు శుక్రవారం టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. మంజుల వన్నూరుస్వామి గతంలో ఐదేళ్లు ఎంపిపిగా పని చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు కృషి, సహకారంతో అవకాశం దక్కింది. టిడిపి మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యులు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యేలకు, సహకరించిన ప్రతిఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడూ తమ సేవలను గుర్తెరిగి బాధ్యతగా ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు.



మంజుల వన్నూరుస్వామి



పాలబండ్ల ముత్యాలమ్మ

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'కు పాటుపడతాం

ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు


శ్రమదానం చేస్తున్న ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. గురువారం అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ - 2, ఎనిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో "నేషనల్ సర్వీస్ స్కీం స్పెషల్ క్యాంప్" లో భాగంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై అవగాహన ర్యాలీ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిని ఎం.విజయ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా కురుగుంట గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై అవగాహన ర్యాలీ నిర్వహించి స్థానిక పార్కు మైదానంలో శ్రమదానంతో విద్యార్థులంతా పరిశుభ్రం చేశారని తెలిపారు. ఇక్కడున్న ప్రజలకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కార్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి.ప్రిన్సిల్లా, బోయ రాణి, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటీర్ కే.మహేంద్ర, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సంతోష్ నాయక్, తిప్పేస్వామి, అభిషేక్ నాయక్, మురళీకృష్ణ, హరిత, వెంకట సాయి, ప్రశాంత్, శ్రీకాంత్, భవాని సంధ్య, గాయత్రి, ఎవెంజల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన ప్రభుత్వం

వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం అనుమతులు రద్దు చేసి రైతులను దగా చేసిందని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండక నష్టపోయిన వ్యవసాయ పొలాలను స్థానిక వైసిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం దాదాపు పూర్తయ్యే దశలో ఉండగా కూటమి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కలిసి అనుమతులు రద్దు చేశారన్నారు. ఏపీ ప్రజలు, రైతులు కూటమి నాటకాలను గమనించాలన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసేది పోయి సిమెంట్ లైనింగ్ పనులు చేస్తూ జిల్లా రైతులకు మరణ శాసనం రాస్తున్నారన్నారు. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతుల ఖాతాల్లోకి ఒక్క రూపాయి కూడా వేయలేదని విమర్శించారు. రైతు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, హరినాథ్, కోటేశ్వరరావు, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-శింగనమల

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని తరిమెల వైద్యాధికారి శంకర్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగులగుడ్డం తండాలో డ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికోసారి నీటి తొట్లు, డ్రమ్ములను శుభ్రం చేసి ఆరబెట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేకుంటే దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, మునాఫ్, శ్రీధర్‌మూర్తి, సిబ్బంది గంగాధర్, అశ్వర్థనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు రమణయ్య, గీతా, రామాంజినమ్మ, హెల్త్ ప్రొవైడర్ వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా 'గేట్స్' వార్షికోత్సవ సంబరాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గేట్స్ కళాశాల ప్రతినిధులు

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. అంతే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగంలో మార్పులను గమనిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసే నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పైనే ఆధారపడి ఉందని విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పైన పట్టు సాధించాలని కోరారు. అలాగే ఈఏడాది "ఇయర్ ఆఫ్ ఏఐ" అని ప్రకటించారు. ఏఐకి సంబంధించిన రీసర్చ్ సెంటర్ కూడా ప్రారంభించామని చెప్పారు. విద్యార్థుల అభివృద్ధికి అనువైన వాతావరణం, సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాషా, కో ఆర్డినేటర్లు అర్చెక్ ప్రవీణ్, మోహన్‌దాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

నార్పల : ఉగాది పండుగ సందర్భంగా ఆకుల విజయ్‌కుమార్ (బాబు) ఆధ్వర్యంలో మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా విన్నర్ జట్టు రైసింగ్ స్టార్ పురుషోత్తంరెడ్డి, రన్నర్స్ జట్టు బిపిఎల్ హంటర్స్ నాగేంద్రరెడ్డి జట్లకు ట్రోఫీలతోపాటు పతకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కేటాయించాలి

గుత్తి : ప్రభుత్వ రంగ సంస్థల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు కోరారు. శుక్రవారం గుత్తి ఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్దల మస్తానప్ప, విజయ్, కెఎం రంగనాయకులు మాట్లాడుతూ రైల్వేలోని కీలక పదవుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారని చెప్పారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పనకు చేయి చేయి కలుపుదామని పిలుపునిచ్చారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను ఆపాలన్నారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 6న ఆర్ఎస్‌లోని అమ్మవారి శాలలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమలింగ, మధుసూదన్ గుప్తా, కొనకొండ్ల సూరి, దేవన సూర్యప్రకాష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పూసలకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీవాసులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రం సమీపంలో ఉన్న పూసల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు కాలనీ ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో కాలనీ ఏర్పాటైనా ఇప్పటికీ కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా డ్రెయినేజీలు, కల్వర్టులు, తాగునీటి సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. అలాగే కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల స్థానికులు భయభయంగా గడుపుతున్నారన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పూసల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయితీ సెక్రటరీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సి.నాగేంద్ర, పూసల పుల్లయ్య, నాగరాజు, చంటి, చెన్నప్ప, రాములమ్మ, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు

వేగంగా పెరుగుతున్న ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం

జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం, పునరుత్పాధక విద్యుత్ వినియోగం వేగంగా పెరుగుతోందని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య తెలిపారు. ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అధ్యక్షతన శుక్రవారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఐ 2కె 25" నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోయిజం' అనే జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఫల్యం అనేది విజయానికి వ్యతిరేక పదం అన్నారు. కానీ వైఫల్యం అనేది విజయానికి సోపానం అఅన్నారు. త్వరలోనే ఇంకుబేషిన్ సెంటర్‌ను ప్రారంభం చేసి విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు వేదికగా కల్పిస్తామని వివరించారు. ఇలాంటి సింపోయిజంలు నిర్వహించడం వల్ల విద్యార్థులు వారి మేథాశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లాస్సెస్ (నష్టాలు) పూర్తిగా తగ్గించే విధంగా పని చేయాలన్నారు. రాబోవు కాలంలో ముఖ్యంగా ఎలక్ట్రికల్ వెహికల్స్, పునరుత్పాధకమైన (రెన్యూవబుల్) ఎనర్జీ విభాగాల్లో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. విద్యార్థులు ఇలాంటి సదస్సులను సద్వినియోగం చేసుకుని సరికొత్త ఆలోచనలతో మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థులు వారిలోని నైపుణ్యాలను వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. రాబోవు కాలంలో సోలార్ విద్యుత్ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని వివరించారు. అనంతరం ఇఇఇ విభాగం సావనీర్‌లను సిడిల రూపంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమమానికి కన్వీనర్‌గా ఎం.రామశేఖరరెడ్డి, కోఆర్డినేటర్‌గా శ్రీధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎం.విజయకుమార్, పి.సుజాత, ఆర్.కిరణ్మయి, ఎన్.విశాలి, నాగప్రసాద్ నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, విబి చిత్ర, కెఎఫ్ భారతి, ఓంప్రకాష్, జితేంద్రగౌడ్, ఎం.అంకారావు, జె.శ్రీనివాసులు, శారద, మాజీ ఆచార్యులు వి.శంకర్, స్టూడెంట్ కోఆర్డినేటర్లు ఎల్.రాజేష్ కుమార్‌రెడ్డి, పి.కావ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : ఎంపిపి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి విశాలాక్షి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి జి.విశాలాక్షి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారని గుత్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని ఇసురాళ్లపల్లి సర్పంచి వాసుదేవరెడ్డి కోరారు. మండలంలోని రైతులకు సరిపడా పరికరాలు రాలేదని జేడీఏకు నివేదిక పంపి మంజూరుకు కృషి చేస్తామని వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ తెలిపారు. బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని లచ్చానుపల్లి సర్పంచి మజ్జిగ గోపాల్ కోరారు. చెర్లోపల్లి– మార్నేపల్లి గ్రామాల మధ్యలో కల్వర్టు నిర్మించాలని తద్వారా పెద్దొడ్డిలో గ్రామంలో ఉన్న సచివాలయానికి వెళ్లేందుకు దూరం తగ్గుతుందని సర్పంచి అప్పా వెంకటేష్ తెలిపారు. మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణ, సర్పంచులు పి.భరత్‌కుమార్, లహరిరెడ్డి, కె.రమేష్‌బాబు, ఎన్.రాజేశ్వరి, బేడల లక్ష్మీదేవి, ఎం.పాపన్న, ఎంపిటిసిలు సుమలత, ఎంసి లాలెప్ప, చిన్న ఈరన్నగౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్, పిఆర్ ఎఇలు అశ్విని, మల్లేష్‌నాయక్, హెచ్ఎ మిత్రవింద మాధవి, పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, సుమలత, వెంకటేష్, రామలింగప్ప, సాదిక్, చంద్రశేఖర్, ఎర్రిస్వామి, సంతోష్, బోయ వెంకటేష్, శివ, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతనంగా నియమితులైన వివిధ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. నూతనంగా నియమితులైన పెన్షనర్ల విభాగం నగర అధ్యక్షులు తలారి వెంకటేశులు, పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శుక్రవారం అనంతపురంలోని స్వగృహంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసిపి నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. కూటమి నేతలు సాగిస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక పివికెకె డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను ఆప్టిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్ రౌండ్ ద్వారా దాదాపు 80 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్, డైరెక్టర్ పల్లె సింధూరారెడ్డి, సెక్రటరీ పల్లె రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ బి.రాఘవేంద్ర ప్రసాద్, మునికృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్య క్రమంలో ఎ.సురేష్‌బాబు, వై.నరేంద్రరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబా ఫకృద్దీన్, ఎఒ వన్నూరుప్ప, బిబిఎ హెచ్ఒడి కిరణ్‌కుమార్, బి.కామ్ హెచ్ఒడి విజయ్‌కుమార్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా డిగ్రీ, పీజీ పూర్తయిన తర్వాత ఆయా యూనివర్శిటీల్లో స్నాతకోత్సవ వేడుకలు నిర్వహిస్తారన్నారు. అయితే చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ–2, 5వ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఆ ఏడాది చివరిలోనే ఈ వేడుకలను తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, కోఆర్డినేటర్ ఇర్షాద్, ఎఒ గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై చర్చకు సిద్ధం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉపాధి హామీ పథకంలో తాను అవినీతికి పాల్పడినట్లు చేస్తున్న ఆరోపణలపై చర్చకు సిద్ధమా..? అని టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చెన్నంపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులపై అవినీతి జరిగినట్లు కొంతమంది వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. వైసిపి హయాంలోనే ఉపాధి పనులకు వెళ్లకున్నా ఆ పార్టీ నాయకులు వెళ్లినట్లు మస్టర్లు పెట్టుకుని దోచుకున్నారని ఆరోపించారు. అంతేగాకుండా ఇదే గ్రామానికి చెందిన నాయకులు కొంతమంది పేదలతో ఇళ్ల స్థలాలకు డీపట్టాలు ఇస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.20వేలు వసూలు ధ్వజమెత్తారు. వైసిపి హయాంలో అవినీతికి పాల్పడి తమ కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. తాను అవినీతికి పాల్పడినట్లు చెప్పే నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో చెన్నంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

'చెత్త సంపద'ను చూద్దాం రారండి

నార్పల : 'మన గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని చూద్దాం రండి' అంటూ ఉపసర్పంచు ఆలం వెంకట నరసానాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బొందలవాడ గ్రామ మహిళలందరూ ఉత్సాహంతో వీధుల గుండా ర్యాలీగా వెళ్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఇళ్లలోని చెత్తను రోజువారి పారిశుధ్య కార్మికులకు అందించిన తర్వాత వాటి నుంచి సేంద్రీయ ఎరువుల తయారీ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియను ఎలా చేపడుతారో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఎపిఎం తిప్పమ్మ, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ముస్లిముల మనోభావాలను దెబ్బతీస్తున్న బిజెపి


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి ముస్లిం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ముస్లిముల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మేయర్ వసీం, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్, రిజ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రాష్ట్రపతి వెన్నక్కి పంపాలని కోరారు. దాదాపు 30 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాల్లో బిల్లును వ్యతిరేకించారన్నారు. అయినా లోకసభ, రాజ్యసభలో ఆమోదించడం బాధాకరమన్నారు. వక్ఫ్ ఆస్తిపై కలెక్టర్లకు సర్వాధికారాన్ని ఇవ్వడాన్ని ఒప్పుకునే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. అలాగే వక్ఫ్ బోర్డుల్లో ఇతరులను సభ్యులుగా తీసుకునే సవరణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ బిల్లుపై రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో బిల్లుకు వ్యతిరేకంగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేను కలిసిన పామిడి ఎంఇఒ

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను శుక్రవారం కర్నూలు జిల్లా ఆలూరులోని స్వగృహంలో మండల విద్యాధికారి జయానాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాఠశాల పునర్ వ్యవస్థీకరణ కార్యక్రమంలో జరుగుతున్న విధి, విధానాలను ఎమ్మెల్యేకు వివరించారు.

వక్ఫ్ బోర్డు సవరణకు వ్యతిరేకంగా నిరసన

యాడికి : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కరపత్రాలు పంచుతూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మోహన, శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి బషీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతోందన్నారు. ఇందులో భాగమే లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలు పెరిగిపోయాయన్నారు. ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ద్వారా ముస్లిములు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి చేసేందుకు తలపెట్టిందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలతో పాటు నోటుబుక్కులు కూడా పంపిణీ చేస్తోందన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఖాజాబీ, లక్ష్మీరంగయ్య, బాబా మైనుద్దీన్, ఆనందకుమార్, శివారెడ్డి, వీరేష్, మురళి, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు రాతిదూలం పోటీలు

పుట్లూరు : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని రంగమనాయునిపల్లి గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం రాతిదూలం పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.60వేలు, 2వ బహుమతి రూ.40వేలు, 3వ బహుమతి రూ.25వేలు, 4వ బహుమతి రూ.15వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

పెద్దవడుగూరు : సమాజంలోని ప్రతిఒక్కరూ బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తాడిపత్రి ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం–3లో బాల్యవివాహాల నిరోధక కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్యవివాహలు చేయడం వల్ల కలిగే అనార్థాలపై వివరించారు. ముందుగా ఆడపిల్లల్ని ఎదగనిచ్చి విద్యను అందించాలన్నారు. విద్యవల్లే ఆడపిల్లలకు భద్రతతోపాటు నమ్మకం కలుగుతుందన్నారు. ఆడపిల్లి చదువు సమాజాభివృద్ధికి తోడ్పడుతుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి వరలక్ష్మి, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు అనిల్, ఆంజనేయులు, మహిళా పోలీసులు శాంత, ప్రత్యూషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అనిల్‌కుమార్, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం : నేషనల్ హెల్త్‌మిషన్ ప్రోగ్రాంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లినికల్ సైకాలజిస్ట్–1, ఆడియాలజిస్ట్, స్పీచ్ తెరపిస్ట్–1, ఆప్టోమెట్రిస్ట్ –1, ఫార్మాసిస్ట్–1, డేటా ఎంట్రీ ఆపరేటర్–1, లాస్ట్ గ్రేట్ సర్వీస్ (క్లాస్ 4)–1 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://anantapuramu.ap.gov.inను సందర్శించాలని కోరారు.

8న మండల సర్వసభ్య సమావేశం

పామిడి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈనెల 8న మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పంప్డ్ పవర్ స్టోరేజ్ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ

యాడికి : పంప్డ్ పవర్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు విషయంపై మండలంలోని కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల్లో అధికారులు శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల సామాజిక స్థితిగతులతోపాటు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ప్రతాపరెడ్డి, ఎంపిడిఒ వీర్రాజు, ఎపి జెఎన్‌కో ఇఇ అజయ్‌కుమార్, డిఇ ఆంజనేయులు, ఆర్‌అండ్‌బి డిఇ సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, జిల్లా సర్వేయర్లు చంద్రశేఖర్, నాగరాజు, వీఆర్వోలు, సర్పంచులు పాల్గొన్నారు.

సహజ ప్రసవం ఆరోగ్యానికి మేలు

గుత్తి : సహజంగా ప్రసవం జరిగితే ఆరోగ్యానికి ఎంతో మేలు అని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సహజ ప్రసవం వల్ల తల్లులకు కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, చైతన్య, మీగులీనా, హెడ్ నర్స్ నాగమణి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో రోగాలు దూరం

గుత్తి : దంతాలను సంరక్షించుకుంటే రోగాలకు దూరం కావచ్చని ప్రభుత్వ దంత వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి అన్నారు. మార్చి 20 తేదీ నుంచి ఏప్రిల్ 20 తేది వరకు జరిగే ప్రపంచ నోటి దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ రెండు పూటలా దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. దంతాల శుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన

అనంతపురం : నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ కేశవనాయుడు ఆధ్యక్షతన శుక్రవారం పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై సబ్ డివిజనల్ కమిటీ సమావేశం నిర్వహినంచారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ భ్రూణహత్యలపై నిఘా ఉంచాలన్నారు. భ్రూణహత్యలను ఎవరు ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్ సౌజన్య, చిన్నపిల్లల వైద్యులు రవికుమార్, పేతాలజిస్ట్ శ్రావణి, ఆర్‌డిటి డాక్టర్ దుర్గేష్, ప్రోగ్రాం ఆఫీసర్ రవిశంకర్, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి యాదవ్, ఐఅండ్‌పిఆర్ నుంచి గురుస్వామి శెట్టి, రెడ్స్ నుంచి భానుజ, హెడ్స్ నుంచి రామ్మోహన్, ఐసిడిఎస్ నుంచి సంధ్య, డెమో ఎం.త్యాగరాజు, గంగాధర్, లీగల్ మానిటర్ కన్సల్టింగ్, ఆషారాణి, సి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం పంచాయతీలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులను చేయిస్తున్న కార్యదర్శి ప్రవీణ్‌బాబు

అనంతపురం : గత రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ఎ.నారాయణపురం పంచాయతీలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌బాబు జెసిబిలతో శుక్రవారం తీయించారు. అలాగే పంచాయతీ కార్మికులతో బళ్లారి రోడ్డులోని విద్యుత్ కేంద్రం పక్కన డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో గుంతలు పడ్డ చోట జెసిబితో చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిరెడ్డి పరదేశీనాయుడుకు డాక్టరేట్


పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న పరదేశీనాయుడు

అనంతపురం : ప్రభుత్వ వైద్య కళాశాల అనంతపురంలో మైక్రో బయాలజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆదిరెడ్డి పరదేశీనాయుడు శుక్రవారం చెన్నైలోని భారత్ యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. పరదేశీనాయుడు డెంగీ వైరస్‌పై చేసిన పరిశోధనకు తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి గోవి చెజియాన్ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పరదేశీనాయుడుకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని బసాపురం గ్రామంలో గత ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి నలుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ వెంకటేశులు తెలిపారు. బసాపురం గ్రామానికి చెందిన దళిత గోవిందరాజులుపై మాయదారులపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తం, మల్లికార్జున, ఓబన్న, వడ్డెపాలెం గ్రామానికి చెందిన రవి దాడి చేసినట్లు ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.